www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 200 | గురువారం | 12 - 12 - 2024 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## మళ్లీ 80 వేలపైకి పసిడి




3

### రాష్ట్రాలు చర్యలు
## తీసుకోవచ్చు



తొలిఅడుగు, న్యూఢిల్లీ : సామాజిక మాధ్యమాల్లో మహిళలను వేధించే, అప్రతిష్ట పాలు చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్రం స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరులను దూషించటం సహా సైబర్ నేరాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని కేంద్రం

2

### నటుడు మోహన్‌బాబుకు
## హైకోర్టులో ఊరట



తొలిఅడుగు, హైదరాబాద్ : నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో ఊరట లభించింది. మోహన్‌బాబుకు పోలీసులు జారీ చేసిన నోటీసులపై హైకోర్టు స్టే విధించింది. పోలీసుల నోటీసులపై స్టే కోరుతూ మోహన్‌బాబు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్

2



# అధికారుల ఆస్తులు
# జప్తు చేయండి

తొలిఅడుగు, హైదరాబాద్ : చెరువులు, కుంటలు వంటి జలవనరుల పరిధిలో భవన నిర్మాణాలకు ముందుగా అనుమతులిచ్చి.. ఇప్పుడు అవి అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేస్తే ఎలాగని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. అక్రమమని తెలిసి కూడా అనుమతులు ఇచ్చి, ఇప్పుడు వాటిని కూల్చివేస్తే వాటికి నష్టపరిహారాన్ని అధికారులే చెల్లించాల్సి ఉంటుందని ఉన్నత న్యాయస్థానం హెచ్చరించింది. అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. ఇక మీదట అక్రమ నిర్మాణాల కూల్చివేతల వ్యవహారంలో వాటికి అనుమతులు ఇచ్చిన సంబంధిత అధికారుల ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. అనుమతులు

2

- ☐ అక్రమమని తెలిసే అనుమతులిచ్చారా?
- ☐ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయండి
- ☐ వారి తప్పులకు ప్రజాధనం ఎందుకు చెల్లించాలి?
- ☐ కూల్చివేతల్లో ప్రభుత్వ తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు

### రాజ్యాంగ ప్రతిరూపం
## ధ్వంసంపై నిరసనలు



తొలిఅడుగు, ముంబై: రాజ్యాంగ ప్రతిరూపం ధ్వంసంపై నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనకారులు పిలుపునిచ్చిన బంద్ హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు పలు వాహనాలకు నిప్పుపెట్టడంతోపాటు రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. మహారాష్ట్రలోని పర్భానీ

2

### సీఎం కాన్వాయ్‌ను
## ఢీకొట్టిన కారు



2

తొలిఅడుగు, జైపూర్: రాంగ్ రూట్‌లో వచ్చిన కారు సీఎం కాన్వాయ్‌ను ఢీకొట్టింది. దీంతో ఆ కారుతోపాటు సీఎం కాన్వాయ్‌లోని రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ముగ్గురు పోలీసులతో

### మున్సిపల్ కమిషనర్‌పై
## హైడ్రా ఆగ్రహం



2

తొలిఅడుగు, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా కుంట్లూర్ పెద్ద చెరువు కబ్జాపై హైడ్రా సర్వే చేస్తున్న స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం పరిశీలించారు. కుంట్లూర్ పెద్ద చెరువును కబ్జా చేసి రోడ్డు వేస్తున్నారన్న ఆరోపణలతో నిన్నటి నుంచి హైడ్రా అధికారులు సర్వే చేస్తున్నారు. మున్సిపల్ నిధులతో రోడ్డు నిర్మాణానికి తీర్మానం చేయడంపై పెద్దఅంబర్ పేట్

### ఏపీలో ఇంటర్ పరీక్షల
## షెడ్యూల్ విడుదల



తొలిఅడుగు, అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఇంటర్ మీడియట్ బోర్డు ఇంటర్ పరీక్షల తేదీల షెడ్యూల్‌ను విడుదల చేసింది. పదో తరగతి పరీక్షల తేదీలను వెల్లడించిన కొద్ది నిమిషాల్లోనే ఇంటర్ పరీక్షల తేదీలను ప్రకటించారు. మార్చి 1 నుంచి 19 వరకు ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు, మార్చి 3 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ రెండో సంవత్సర పరీక్షలను నిర్వహించనుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని

2

### కలెక్టర్ల సదస్సులో
## కీలక వ్యాఖ్యలు



తొలిఅడుగు, అమరావతి : ఏపీ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. అధికారులు వ్యవస్థలను బలోపేతం చేయాల్సి ఉండగా నిస్సహాయత వ్యక్తం చేస్తే సామాన్య మానవుడు ఎవరి

2

# కలెక్టర్ల సమర్థతతోనే ప్రజలకు న్యాయం

### ఇప్పుడిప్పుడే చీకట్లు తొలగిపోతున్నాయి – కలెక్టర్ల సదస్సులో చంద్రబాబు స్పష్టీకరణ

తొలిఅడుగు, అమరావతి : ప్రజలతో గౌరవంగా ఉండండి. వారు కూడా ప్రభుత్వంలో భాగస్వాములే. ప్రజలకు మన పనులు నచ్చేలా చేయాలి” అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. మానవత్వంతో ఆలోచించి పనిచేయాలని సూచించారు. కలెక్టర్ల సమర్థత వల్లే ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. “ప్రభుత్వం మంచి పాలసీలు తీసుకొచ్చినా, వాటిని మీరే అమలుచేయాలి. మనమంతా ప్రజలకు సేవకులుగా ఉందాం. పీపుల్ ఫస్ట్ అనేది మన నినాదం కావాలి” అని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. “రాష్ట్రంలో పరిస్థితి గాడిలో పడుతోంది. ఇప్పుడిప్పుడే చీకట్లు తొలగిపోతున్నాయి. గత ప్రభుత్వంలో ప్రజలు మాట్లాడటానికి భయపడేవారు.

2



## రాజ్యాంగ ప్రతిరూపం ధ్వంసంపై నిరసనలు

**మొదటిపేజీ తరువాయి** జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రైల్వే స్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు గాజు పెట్టెలో ఉంచిన రాజ్యాంగ ప్రతిరూపాన్ని మంగళవారం సాయంత్రం ఒక వ్యక్తి ధ్వంసం చేశాడు. ముర్జిజాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు సోపాన్ పవార్‌ను పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు. కాగా, ఈ సంఘటనకు నిరసనగా బుధవారం పర్భానీ జిల్లాలో బంద్ జరిగింది. తొలుత ప్రశాంతంగా కొనసాగిన నిరసనలు తర్వాత హింసాత్మకంగా మారాయి. నిరసనకారులు పలు వాహనాలకు నిప్పు పెట్టారు. రాళ్లదాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఆందోళనకారులను చెదరగొట్టారు. పర్భానీలో 144 సెక్షన్ విధించారు. శాంతి పునరుద్ధరణ చర్యలపై చర్చించడానికి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారు.

## సీఎం కాన్వాయ్‌ను ఢీకొట్టిన కారు

**మొదటిపేజీ తరువాయి** సహా ఐదుగురు గాయపడ్డారు. సీఎం వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం మధ్యాహ్నం 3.00 గంటలకు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌తో కలిసి నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించేందుకు సీఎం భజన్‌లాల్ శర్మ తన కాన్వాయ్‌లో బయలుదేరారు. కాగా, అక్షయపాత్ర కూడలి వద్ద రాంగ్ సైడ్ నుంచి వచ్చిన ట్యాక్సీ కారు సీఎం కాన్వాయ్‌లోని తొలి రెండు వాహనాలను ఢీకొట్టింది. ఈ ఆకస్మిక ఘటనతో కాన్వాయ్‌లోని ఇతర వాహనాలకు బ్రేకులు వేయడంతో మరో వాహనం డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు పోలీసులతోపాటు ట్యాక్సీ కారు డ్రైవర్, మరో వ్యక్తి గాయపడ్డారు. మరోవైపు ఈ సంఘటన జరిగిన వెంటనే సీఎం భజన్‌లాల్ శర్మ కారు నుంచి కిందకు దిగారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సురేంద్ర సింగ్ పరిస్థితి విషమంగా ఉందని ఆరోగ్య అధికారి తెలిపారు. తలకు గాయమైన అతడు వెంటిలేటర్‌పై ఉన్నట్లు చెప్పారు. కాగా, సీఎం భజన్‌లాల్ శర్మ కాన్వాయ్ ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## రాష్ట్రాలు చర్యలు తీసుకోవచ్చు

**మొదటిపేజీ తరువాయి** పార్లమెంట్‌లో వెల్లడించింది. ఈ క్రమంలో భారతీయ న్యాయ సంహిత 2023 చట్టం సెక్షన్ 78 ప్రకారం మహిళలను వేధించే వారిపై అప్రతిష్టపాలు చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవచ్చు. ఇలాంటి కేసుల విషయంలో సంబంధిత చట్టంలోని సెక్షన్ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలకు ఉపక్రమించవచ్చు.

మహిళలు, పిల్లలపై సైబర్ నేరాలు అరికట్టేందుకు కేంద్ర హోంశాఖ కూడా ప్రస్తుతం సైబర్ క్రైమ్ ప్రివెన్షన్ ఎగెనెస్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ చిల్డ్రన్ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యక్తుల డేటా, వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులను కాపాడేందుకు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023 కూడా అమలులో ఉంది. టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా పార్లమెంట్లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా సైబర్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ మోసాల వంటి కార్యకలాపాలు డిజిటల్ ఇండియాలో ప్రధాన అడ్డంకులుగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం కొత్త ఐటీ రూల్స్‌ని ప్రవేశపెట్టింది. దీంతో సోషల్ మీడియా జవాబుదారీతనం ద్వారా డిజిటల్ ఇండియాలో సమస్యలు పరిష్కరించబడతాయి. ఈ క్రమంలో ఆన్‌లైన్ ట్రోలింగ్, ఆన్‌లైన్ మోసాలపై చర్యలు తీసుకోవచ్చు. ఈ చట్టం ద్వారా సామాజిక, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను మరింత సురక్షితంగా వినియోగించుకోవచ్చు.

## నటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో ఊరట

**మొదటిపేజీ తరువాయి** దాఖలు చేయగా, కోర్టు విచారణ చేపట్టింది. ఈ నెల 24వ తేదీ వరకు పోలీసుల ముందు హాజరుకు కోర్టు మినహాయింపు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. ప్రస్తుతం మోహన్‌బాబు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక మోహన్‌బాబుపై నమోదైన కేసులను కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది వివరించారు. పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. జర్నలిస్టుపై దాడి కేసులో మరో క్రిమినల్ కేసు నమోదైందన్నారు. నోటీసులు అందుకున్న మనోజ్ ఇవాళ విచారణకు వచ్చారు. మోహన్‌బాబు ఇంటి వద్ద పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని ఆయన న్యాయవాది కోర్టుకు విన్నవించారు.

# మున్సిపల్ కమిషనర్‌పై హైడ్రా ఆగ్రహం

**మొదటిపేజీ తరువాయి** మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్ రెడ్డిపై రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో త్వరలో కమిషనర్‌పై యాక్షన్ తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చెరువు భూమిలో ఎలా రోడ్డుకు నిధులు కేటాయిస్తారని రంగనాథ్ ప్రశ్నించారు. సర్వే త్వరగా పూర్తి చేసి చెరువు, పట్టా భూమి బార్డర్‌లో రోడ్డు ఫిక్స్ చేయాలని హైడ్రా సిబ్బందికి ఆయన సూచించారు. చెరువు స్థలంలో రోడ్డు వేస్తే తొలగించాలని హైడ్రా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అయితే రోడ్డు నిర్మాణంలో థర్డ్ పార్టీ చేశారని హైడ్రా కమిషనర్‌కు పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ వివరించారు. ఈ రోడ్డు విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. థర్డ్ పార్టీ ఏర్పాటు చేసినప్పుడు వారిపై కేసులు పెట్టాలి కదా ఎందుకు యాక్షన్ తీసుకోలేదని రంగనాథ్ ప్రశ్నించారు.

# ఏపీలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**మొదటిపేజీ తరువాయి** మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

చదువుపై దృష్టిని సారించేందుకు సరైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల భయంతో ఒత్తిడికి లోనుకాకుండా, ఆరోగ్యం కాపాడుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని కోరారు. పరీక్షలు రాసే విద్యార్థులందరికీ ‘ ఆల్ ది బెస్ట్ ’అని ఆయన తెలిపారు.

**– పదవ తరగతి పరీక్షల తేదీలు ఖరారు**

ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు జరుగుతాయని మంత్రి ప్రకటించారు. 17న ఫస్ట్ లాంగ్వేజ్,19న సెకండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లిష్, 24న మ్యాథ్స్, 26న ఫిజిక్స్,28న బయోలజీ, 31న సోషల్ పరీక్షలు జరుగనున్నాయని వివరించారు.

# కలెక్టర్ల సదస్సులో పవన్‌కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి** వద్దకు వెళ్లారని తెలిపారు. ఏపీలో పరిపాలన ఆదర్శవంతంగా ఉండి ప్రశంసించేలా ఉండాలే తప్పా ఎలా ఉండకూడదో చేసి నిరూపించుకోవాలని సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి అధికారుల సహకారం కావాలని అన్నారు. గత ప్రభుత్వ చేసిన పనులన్నీ మూలాలను కదిలించే స్థాయికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి మూలాల నుంచి తొలగించే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. అధికారులు మౌనం వహించడం వల్లే రాష్ట్రం రూ.10 లక్షల కోట్లు అప్పులు మిగిలాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే పాలసీలు తాము చేయగలమని,వాటిని సమర్థవంతంగా ప్రజల వద్దకు తీసుకెళ్లే గురుతర బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మూడు చెక్‌పోస్టులను ఏర్పరచినా కూడా ఇష్టారాజ్యంగా స్మగ్లింగ్ జరుగుతుంటే ఎవరిని నిందించాలని అన్నారు. కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు.

# అనుమతులిచ్చిన అధికారుల ఆస్తులు జప్తు చేయండి

ఉన్న వాటిని అక్రమ నిర్మాణాలని కూల్చివేస్తే వాటి బాధితులకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాల్సిన అవసరంలేదని స్పష్టంచేసింది. ప్రభుత్వం ప్రజా ధనాన్ని బాధితులకు పరిహారంగా చెల్లించడానికి వీల్లేదని చెప్పింది.

అధికారుల తప్పులకు ప్రభుత్వ ధనాన్ని ఎందుకు చెల్లించాలని ప్రశ్నించింది. అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారుల నుంచే పరిహారం మొత్తాన్ని రాబట్టాలని, వారి ఆస్తులను జప్తుచేస్తే జేజమ్మలు దిగొస్తారని వ్యాఖ్యానించింది. అధికారుల ఆస్తులను జప్తు చేస్తే అప్పుడు వాళ్లకు తాతలు కనిపిస్తారని కూడా వ్యాఖ్యానించింది. చెరువులు, కుంటలు వంటి జలవనరుల సంరక్షణ ముఖ్యమేనని, అయితే వాటి పరిధిలో, అదీ అధికారుల అనుమతులతో నిర్మాణాలు చేశాక ఇప్పుడు వాటిని అక్రమమని నోటీసులు ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భవనాలకు అనుమతులిచ్చి తీరా అకడ నిర్మాణాలు పూర్తయ్యాక బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో అవి ఉన్నాయని, కూల్చివేస్తామని నోటీసులు జారీ చేయడంలో అధికారుల ఆంతర్యం ఏమిటని మండిపడింది.

**– అనుమతులిచ్చిన అధికారుల మాటేమిటి?**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మంగర్షికుంట బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాల తొలగింపునకు నీటిపారుదల శాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను సవాలు చేస్తూ సచిన్ జైస్వాల్ సహా ముగ్గురు పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ సీవీ భాస్కరరెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నోటీసులు జారీచేస్తూ.. ఏడు రోజుల్లో బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారని తెలిపారు. అనుమతులు తీసుకొని నిర్మించుకున్న రేకుల ఇండ్లను కూల్చివేసేందుకు చర్యలు తీసుకోనున్నారని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. అధికారుల అనుమతులతో నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేస్తామంటే ఎలాగని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధి తొమ్మిదో లేదా పదో మీటర్లు ఉంటుందని, నీటిపారుదల, పురపాలక శాఖలు, గ్రామ పంచాయతీ అధికారుల అనుమతులు తీసుకొని నిర్మించిన తర్వాత ఇప్పుడు అక్రమ నిర్మాణాలంటే ఎలాగని ప్రశ్నించింది. చెరువులను పరిరక్షించాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని, అదే సమయంలో అన్ని అనుమతులతో కట్టుకున్న నిర్మాణాలను కూల్చివేస్తే, మరి అనుమతులు ఇచ్చిన అధికారుల మాటేమిటని నిలదీసింది. అవి అక్రమ నిర్మాణాలని తేలినప్పుడు తగిన నోటీసులు జారీచేసి వారి వివరణ తీసుకుని చర్యలు తీసుకోవాల్సి వుంటుందని స్పష్టంచేసింది. నీటిపారుదల శాఖ అధికారులు జారీ చేసిన నోటీసులపై పిటిషనర్లు 15 రోజుల్లో అన్ని ఆధారాలతో, తగిన పత్రాలతో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. గోడకు అంటించిన నోటీసుల ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని నీటిపారుదల శాఖ అధికారులకు తేల్చి చెప్పింది.

# కలెక్టర్ల సమర్థతతోనే ప్రజలకు న్యాయం

**మొదటిపేజీ తరువాయి** ఇప్పుడు స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పే పరిస్థితి వచ్చింది. బయట ప్రజలు నవ్వుతూ ఉన్నారంటే ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడినట్లే! దీనిని కొనసాగించేలా మన పాలన కొనసాగాలి” అని చంద్రబాబు అన్నారు. విధ్వంసం తర్వాత జరిగే పునర్నిర్మాణానికి అందరూ కష్టపడి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వంలో అధికారులకు కూడా ఒకటో తేదీన జీతాలు వచ్చేవి కాదని, ఈ ప్రభుత్వం వచ్చాక జీతాలు, పెన్షన్లు మొదటి తేదీనే ఇస్తున్నామన్నారు. “గత ఐదేళ్లలో ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారు. పక్క రాష్ట్రాలకు వెళ్తే ఏపీ గురించి అవహేళన చేసే పరిస్థితికి దిగజార్చారు. ఈ ఆరు నెలల్లో మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయి.



మళ్లీ రాష్ట్రానికి బ్రాండ్ పెరుగుతోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఇంకా వేగం పెంచాలి. ఇందుకు కలెక్టర్లలో పోటీ వాతావరణం రావాలి. ఇన్నేళ్లలో తొలిసారి ఇబ్బందికర పరిస్థితులు చూస్తున్నాను. రూ. 10లక్షల కోట్ల అప్పులు పేరుకుపోయాయి. రూ.లక్ష కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. మరోవైపు ఆదాయం లేదు. అభివృద్ధి జరిగితే సంపద వల్ల ఆదాయం వస్తుంది. పోనీ అప్పులు చేద్దామంటే ఎఫ్‌ఆర్‌బీఎం అనుమతించలేని దుస్థితి వచ్చింది” అని చంద్రబాబు అన్నారు. ‘గతంలో నేను ఎప్పుడూ చూడనిది రేషన్ బియ్యం అక్రమ రవాణా. ఈ అక్రమాలను పునాదులతో సహా పెకలించివేయాలి. రెండు నెలల్లో మొత్తం కట్టడి కావాలి. గతంలో పోలం గట్లు కబ్జా మాత్రమే జరిగేది. కానీ వైసీపీ ప్రభుత్వంలో పోర్టులు, సెజ్‌లు కబ్జాకు గురయ్యాయి. అందుకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకొచ్చాం. యంత్రాంగంలో ఇంకా పాత వాసనలు పోలేదు. అక్కడక్కడా కొన్ని విషయాల్లో నాకు కూడా తెలియకుండా చేస్తున్నారు. అలాంటి అంశాల్లో కఠినంగా వ్యవహరించాలి.


# పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి బాలిక వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం





తొలి అడుగు పరవాడ డిసెంబర్ 11 : పరవాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు మేరకు కిశోరి వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ లలిత కుమారి అన్నారు. పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీలకు, ఎఎన్ఎంలకు, మహిళా పోలీసులకు, ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిఓటిసిలు, ఎంపిడిఒ శ్యామ్ సుందర్, పరవాడ సి.ఐ మల్లికార్జున రావు, ఎం.ఈ. ఓ సాయి శైలజ, దివాకర్, పిహెచ్సి వైద్యాధికారి హారిక, వివిధ అంశాలపై గ్రామస్థాయి అధికారులకు, ఉపాధ్యాయులకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ శిక్షణ అందజేశారు. ముఖ్యంగా 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టాలు, బాల్య వివాహాలు, సమాజంలో మెలుకువలు, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా సిడిపిఒ లలిత కుమారి మాట్లాడుతూ కిశోరి వికాస కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశంపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాలబాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించడంతోపాటు వాటిని ఏవిధంగా పరిష్కరించుకోవాలో సూచనలు, సలహాలు కూడా అందించాలన్నారు. బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే వచ్చే అనర్థాలను వివరించడంతోపాటు వాటిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చాటి చెప్పాలన్నారు. మరీ ముఖ్యంగా చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ లు, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఎ. ఎన్. ఎం లు, మహిళ పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ లు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పంగిడిగూడెంలో రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులు కూటమి నేతలు



తొలి అడుగు, జంగారెడ్డిగూడెంనవంబర్ 11: రాష్ట్ర వ్యాప్తంగా భూమి సంబంధిత సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న ఆపద్యంలో జంగారెడ్డిగూడెం మండలంలోని ఈరోజు నుంచి రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. మొదటిగా పంగిడిగూడెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించ గా ఈ సదస్సుకు జంగారెడ్డిగూడెం ఆర్టీవో రమణ, ప్రత్యేక అధికారి కోట ప్రభాకర్ ఎమ్మార్వో %ంశ్రీవఝు% జోజి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సాయిల్ సత్యనారాయణ గ్రామ అధ్యక్షులు లింగాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మీ గ్రామంలో ఉన్న భూ సమస్యలపై పరిష్కారానికి ఈ సదస్సులు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ప్రజలు వారి వారి సమస్యలపై ఫిర్యాదు చేశారు.

## కోక్ బాట్లింగ్‌లో జుబిలెంట్‌కు వాటా

న్యూఢిల్లీ,తొలి అడుగు: గ్లోబల్ బేవరేజ్ దిగ్గజం కోకా-కోలా.. తమ భారతీయ బాట్లింగ్ వ్యాపార విభాగం హిందుస్థాన్ కోకా-కోలా బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌సీసీబీఎల్)లో 40 శాతం వాటాను జుబిలెంట్ భారతీయ గ్రూప్‌నకు అమ్మేస్తున్నట్టు బుధవారం ప్రకటించింది. ఈ డీల్ విలువ దాదాపు రూ.10,000 కోట్లని తెలుస్తుండగా, జుబిలెంట్ బేవరేజెస్ లిమిటెడ్ కొంటున్నది. కాగా, హెచ్‌సీసీబీఎల్‌కు దేశవ్యాప్తంగా 13 ఫ్యాక్టరీలున్నాయి. 8 బ్రాండ్లలో 37 రకాల ఉత్పత్తులను తయారు చేసి అమ్ముతున్నది. ఇక ప్రపంచవ్యాప్తంగా కోకా-కోలాకు భారత్ ఐదో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నది. ఈ లావాదేవీ ద్వారా వచ్చే నిధులను దేశీయంగా హెచ్‌సీసీబీఎల్ మార్కెట్ బలోపేతానికి కోకా-కోలా వాడుకోబోతున్నట్టు సమాచారం. ఈ లావాదేవీకి రెగ్యులేటర్ల అనుమతులు రావాల్సి ఉన్నది. మరోవైపు జుబిలెంట్ భారతీయ గ్రూప్ కొత్త సంస్థే ఈ జుబిలెంట్ బేవరేజెస్ లిమిటెడ్.

# మళ్లీ 80 వేలపైకి పసిడి



న్యూఢిల్లీ, తొలి అడుగు: బంగారం ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. ఆభరణాల వర్తకులు, స్టాకిస్ట్‌లు అత్యధికంగా కొనుగోళ్లు జరుపుతుండటంతో బంగారం మళ్లీ 80 వేల పైకి చేరుకున్నదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.620 ఎగబాకి మూడు వారాల గరిష్ఠ స్థాయి రూ.80,400 పలికింది. అంతకుముందు ఇది రూ.79, 780గా ఉన్నది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర 80 వేలకు చేరుకున్నది. బంగారంతోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,450 పెరిగి నెల గరిష్ఠ స్థాయి రూ.96,300కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,700 డాలర్లకు చేరుకోవడం వల్లనే దేశీయంగా ధరలు పెరుగుతున్నాయని వర్తకులు వెల్లడించారు.

# అన్నదాతకు అండగా వై.ఎస్.ఆర్.సి.పి పోస్టర్ ఆవిష్కరించిన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్



తొలి అడుగు పరవాడ డిసెంబర్ 11 : పెందుర్తి నియోజకవర్గం రాంపురం వై.సి.పి క్యాంప్ కార్యాలయంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో వై.సి.పి ముఖ్య నాయకులు తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ ఈ నెల 13 వ తేదీన వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో అన్నదాతకు అండగా వైఎస్ఆర్సీపీ కార్యక్రమం లో భాగంగా అనకపల్లి కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కి రైతులతో కలిసి వినతి పత్రం విజ్ఞాన పత్రం సమర్పించే కార్యక్రమానికి నియోజకవర్గంలో ఎంపీపీ,జడ్పీటీసీ ,వార్డు అధ్యక్షులు,సర్పంచ్లు,ఎంపీటీసీ లు ,ముఖ్య నాయకులు ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ కోసం కష్టపడి శ్రమించిన ప్రతి కార్యకర్తకి రానున్న రోజుల్లో నూతన కమిటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలో ప్రతి ఒక్కరికి ఉన్నత పదవులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. వై.ఎస్.ఆర్.సి.పి అధ్యక్షులు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతు సమస్యలపై 13 న అన్నదాతకు అండగా కార్యక్రమం, అలాగే విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు పెంచడం పై ఈ నెల 27 న, విద్యార్థులు కు సంబంధించి అమ్మఒడి, ఫీజు రియబర్స్మెంట్ చెల్లించకపోవడం పై వచ్చే నెల 3న పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతున్నట్టు వెల్లడించారు. గత ఐదేళ్లలో వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతులు ఖాతాల్లో ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం జమచేశారన్నారు. అంతకుమించి ఏటా రూ.20,000 జమ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు బడ్జెట్లో నిధులు కేటాయించకుండా రైతులను మోసం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండుసార్లు పెంచి ప్రజలపై రూ 15,454 కోట్లు భారం వేసిందన్నారు. అంతేకాకుండా యూనిట్ కు రూ. 2.16 పైసలు పెంచిందన్నారు. ట్రూ ఆఫ్ చార్జీలు మొత్తం ప్రభుత్వమే భరించాలని వారు డిమాండ్ చేశారు. వాణిజ్య పంటలు, కూరగాయలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని అన్నారు. ఈ ఏడాది ధాన్యం, చిరుధాన్యాల పంటలకు నష్టం జరిగిన పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. 2014లో ఇలాగే బేషరతుగా పంట రుణమాఫీ చేస్తానంటూ మోసం చేసి కుర్చీ కోసం హామీలు, అధికారం దక్కక మోసాలు ఇది చంద్రబాబు నైజం అని, కూటమి ప్రభుత్వ నమ్మకద్రోహాన్ని నిలదీసి పథకం వచ్చేంతవరకు పోరాడాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు , పెందుర్తి ఎంపీపీ మధుపాడ అంజి నాగమణి,బైలపూడి భగవాన్ జయరామ్,పరవాడ జడ్పీటీసీ పి ఎస్ రాజు,సబ్బవరం ఎంపీపీ బోకం రామనాయుడు సూర్య కుమారి, కోటన్ రాము, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరావు, చీరికి దేవుడు,అనకాపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పలిశెట్టి సురేష్,మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి శ్రీను, కర్రి బాబు,కొన రామారావు, రాష్ట్ర మాజీ ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్ నదియా,వార్డు అధ్యక్షులు దాడి ఉమ మహేష్, మెంతి మహేష్,రాపర్తి మాధవ రావు,దాసరి సత్తిబాబు,మోపడ అప్పారావు,స నారాయణ మూర్తి,బోని గంగు నాయుడు,చందు యాదవ్, వెన్నెల సన్యాసి రావు,జోబ్ దాస్,తమర్ల నరస్సింగ్,శివ ,పైడి రెడ్డి,వర్మ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

– జక్కాపూర్ గ్రామ గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 11 : బుధవారం నారాయణరావుపేట మండలం, జక్కాపూర్ గ్రామ గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలను పట్టించుకోలేదని, కానీ ప్రజా ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికై అనేక సంస్కరణలు చేసి, విద్యార్థులకు, నిరుద్యోగులకు, ప్రజలకు అందుబాటులో తెస్తమన్నారు. జక్కాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం బాగున్నప్పటికి, దాని స్థానంలో 30 లక్షల రూపాయలతో అధునాతన వసతులతో కూడిన కొత్త గ్రంథాలయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేయమని చెప్పడం జరిగింది. ప్రస్తుత గ్రంథలయనికి వారం రోజుల్లో పబ్లిక్ రిడింగ్ రూమ్ మంజూరు చేసి, ఇక్కడకు కావాల్సిన పుస్తకాలను, మాస పత్రికలను, దినపత్రికలను అలాగే ప్రస్తుతానికి కావలసిన మౌలిక వసతులను మంజూరు చేస్తామని అన్నారు.అలాగే గ్రామాల్లో యువతరాన్ని చైతన్యవంతులను చేసేందుకు, వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు గ్రామ గ్రంథాలయాలు విశేష కృషి చేస్తాయని కాబట్టి ప్రజలే మరింత ఉత్సాహంతో ముందుకు వచ్చి గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలన్నారు.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యార్థుల, నిరుద్యోగుల కోసం క్రమం తప్పకుండా సంవత్సరం పొడుగుతా ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించాలనే ఉద్దేశంతోటి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు జాబ్ క్యాలెండరు విడుదల చేయడం జరిగింది. నిరుద్యోగులకు కూడా ప్రభుత్వం మీద పూర్తి నమ్మకం ఏర్పడి అందరూ గ్రంథాలయాలకు అంకితం అవుతూ పూర్తిగా చదువు మీద దృష్టి సారించడం జరిగింది. వారందరికీ కూడా జిల్లా గ్రంధాలయాలు పట్టణ, గ్రామ గ్రంథాలయాలు మౌలిక వసతులను కల్పించి వారిని పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని, అందుకోసం గాను ఎక్కువ సంఖ్యలో పబ్లిక్ రీడింగ్ రూంలను అందుబాటులోకి తెస్తమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్, డిసిసి ఉపాధ్యక్షుడు మంద పాండు, డిసిసి ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాగుల అశోక్, బిసి సెల్ నాయకులు తీగల భాస్కర్, గ్రామ కాంగ్రెస్ అద్యక్షుడు బోయిని బాలయ్య, ఉపాధ్యక్షుడు మాట్ల రాజు, మైనారిటీ అధ్యక్షుడు ఎండి ఇబ్రహీం, సీనియర్ నాయకులు అంబటి విట్టల్, చుంచు కనకయ్య, దాసరి శంకర్, దాకం కనకయ్య,బుచ్చెల్లి శ్రీశైలం, అలాగే గ్రామ కార్యదర్శి నరసింహ చారీ, కరొబారి దాసరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ లో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విద్యార్థి బృందం




తొలి అడుగు, అమనగల్ డిసెంబర్ 11: యునైటెడ్ స్టేట్స్ న్యూయార్క్ నగరంలో ఎనిమిదవ ఆక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించడానికి రాష్ట్రం తరఫునుంచి యువ ఆవిష్కృత బృందంతో అక్కడ జరుగుతున్నటువంటి కార్యక్రమంలో మన రాష్ట్ర తరుపు నుంచి టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారికి ఇచ్చినటువంటి ప్రాజెక్టు వర్క్ ను శ్రద్ధగా నిర్వహిస్తున్నారని తెలిపారు.

## అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

– 9వ 29 వార్డుల లో సర్వే ప్రారంభించిన ఇంద్రమ్మ కమిటీ
– సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



తొలి అడుగు, సిద్ధిపేట జిల్లా, డిసెంబర్ 11 : అర్హులైన ప్రజలందరికీ ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింప చేసేలా చొరవ తీసుకుంటామని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు. సిద్ధిపేటలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ళ కోసం సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు గూడు కల్పించాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇల్లు పథకం తీసుకొచ్చారు అని అన్నారు. ప్రజలకు ఇంత మంచి పథకాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్వే అంతట జరుగుతుందని అర్హులైన వారు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు పుకార్లు నమ్మవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు హాలో అందరినీ గుర్తిస్తామని అన్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు రాదేమో అని అపోహ కూడా పెట్టుకోవద్దని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఎవరైనా మీ దగ్గరికి వచ్చి డబ్బులు అడిగితే ఇవ్వవద్దని అన్నారు. ఎవరైనా వచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని డబ్బులు డిమాండ్ చేస్తే సిద్ధిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణ అధ్యక్షుడు అత్తూఇమామ్ దృష్టికి తీసుకురావాలని అన్నారు. పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గాజుద్దీన్ 29 వార్డ్ ఇంచార్జ్ రాషాద్, నాజ్జు బబులు,ఫాయాజ్, తదితరాలు పాల్గొన్నారు.

## సీఎం కప్ ఆమనగల్ మండల స్థాయి క్రీడోత్సవాలు ఘనంగా ప్రారంభం.

తొలి అడుగు, అమనగల్ డిసెంబర్ 11: రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలో సీఎం క్రీడాత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఆటల పోటీలలో భాగంగా కబడ్డీ కోకో వాలీబాల్ అథ్లెటిక్స్ క్రీడలు జరుగుతున్నాయి. దాదాపు 30 కి పైగా పాఠశాల మరియు ఆమనగల్ మండలంలోని వివిధ గ్రామాల నుండి టీములు ఈ ఆటల పోటీలలో పాల్గొంటున్నాయి ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మండల స్పెషల్ ఆఫీసర్ ఆదిలక్ష్మి , మున్సిపల్ చైర్మన్ రాంపాల్ , వైస్ చైర్మన్ దుర్గయ్య ,మున్సిపల్ కమిషనర్ వసంత ,మండల విద్యాధికారి పాండు , పీడీ లు నజరీన్ మహమ్మద్ , చందర్ మరియు వివిధ పాఠశాలల నుంచి పీఈటీ లు వివిధ పాఠశాలల విద్యార్థులు మరియు వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



## అమంగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యాట గీత నరసింహలకు సన్మానం:

–రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు గూడూరు లక్ష్మి నరసింహ రెడ్డి



తొలి అడుగు, కల్వకుర్తి డిసెంబర్ 11: అమనగల్ వ్యవసాయ మార్కెట్ నూతనంగా ఎన్నుకోబడిన చైర్మన్ యాట గీత నరసింహలకు రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి సన్మానించినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమనగల్ వ్యవసాయ మార్కెట్ లోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుతున్నటువంటి పథకాలను ప్రతి ఒక్కటి రైతులకు అందేటట్టుగా చూడాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మీరు ఎల్లవేళలా దుబాటులో ఉండాలని కోరారు దీనికి చైర్మన్ నేను ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండి వారి యొక్క కష్టసుఖాల్లో పాల్గొని వారికి ఇలాంటి ఇబ్బంది కలవకుండా చూస్తానని హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడ కూతురు వివాహానికి పట్టుచీర, 21 వేల రూపాయలు ఆర్థిక సహాయం : రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్

తొలి అడుగు, కల్వకుర్తి డిసెంబర్ 11: కడ్తాల్ మండల కేంద్రంలోని ఆరవ వార్డుకు సంబంధించిన కేశని బాలమ్మ.. కీర్తిశేషులు శివ దంపతుల కుమార్తె మాధవి వివాహానికి కడ్తాల్ మండలం మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ పట్టుచీర పెట్టి 21 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. వారి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో ఆడపిల్ల పెళ్లి చేయడానికి ఎంతో ఇబ్బంది పడే ఈ రోజుల్లో ఆ విషయాన్ని గ్రహించిన రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దశరథ్ నాయక్ పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు పట్టుచీర 21 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. మండల కేంద్రంలో నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లకు మా ట్రస్ట్ నుండి ఇంకా సేవ చేయడానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో %ఖుఎం% చైర్మన్ వెంకటేష్ గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ ఎంపిటిసి గోపాల్, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కడారి రామకృష్ణ, నాయకులు మంగళపల్లి నరసింహ, లాయక్ అలి,లక్ష్మణ చారి, అశోక్ రామచంద్రయ్య, పాండు, రాఘవేందర్ ,గణేష్ పాండు నాయక్, మహేష్, కొప్పుకృష్ణ ,అంజి శ్రీకాంత్, శ్రీను, యాదయ్య, క్యామ వెంకటేష్, కిషన్, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

## జర్నలిస్టులపై దాడి చేయడం సమంజసం కాదు

- మోహన్ బాబు పై వెంటనే కేసు నమోదు చేయాలి- సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి రెడ్డి




తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 11 : జర్నలిస్టులకు కాంగ్రెస్ అండగా నిలబడుతుంది ప్రభుత్వానికి అన్ని వర్గాలకు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచారాన్ని సేకరించి అందజేస్తున్న జర్నలిస్టులపై దాడులు సమంజసం కాదని మోహన్ బాబు టీవీ9 ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుపై మోహన్ బాబు దాడి చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. అలాంటి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహించం అన్నారు. జర్నలిస్టులపై అకారణంగా దాడులకు పాల్పడి విచక్షణ రహితంగా కొట్టిన మోహన్ బాబు పై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరోసారి జర్నలిస్టులపై దాడి జరగకుండా చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుకు అండగా నిలబడుతుందని అన్నారు. మోహన్ బాబు జర్నలిస్టుపై దాడి చేయడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తొడంగల్ రజిని ముదిరాజ్ , సన ,గొట్టే కవిత , బొంగురం శారద రెడ్డి , పాల్గొన్నారు.

## ఈనెల 16న ఆమనగల్ లో ఉచిత కంటి వైద్య శిబిరం: లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ పి ఆర్ ఓ పాషా



తొలి అడుగు, అమనగల్ డిసెంబర్ 11: ఆమనగల్ మండల కేంద్రంలో ఈనెల 16న లైన్స్ క్లబ్ ఆమనగల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమనగల్ లైన్స్ క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి, పిఆర్ఓ పాషా నేడు ఒక ప్రకటన లో తెలిపారు. కంటి సమస్యలున్న వారు తమ గుర్తింపుకు సంబంధించి తమ ఆధార్, తో పాటు రేషన్ కార్డు, గుర్తింపు కార్డుతో ఈ శిబిరానికి హాజరై ఉచిత చికిత్సలు నిర్వహించుకోవాలన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని ఉచితంగా రామ్ రెడ్డి లైన్స్ ఆసుపత్రికి తీసుకెళ్తున్నట్లు లైన్స్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, పి ఆర్ ఓ పాషా తెలిపారు. ఈ అవకాశాన్ని అమంగల్ పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోపరుచుకోవాలని ఆయన సూచించారు.

## ఎం ఈ ఓ సర్దార్ సేవలు మర్చిపోలేనివి:

- మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్
- రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు లక్ష్మీ నరసింహ రెడ్డి




తొలి అడుగు, కల్వకుర్తి డిసెంబర్ 11: రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఎంఈఓ సర్దార్ వీడుకోలు సమావేశంలో పాల్గొని వారిని మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్ మరియు రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షులు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి ఘనంగా సన్మానించినారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ ఎంఈఓ చేసినటువంటి సేవలను కొని ఆడారు ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఏదో ఒక రోజు వీడుకోలు అనేది ఉంటుందని తర్వాత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని వారు కోరినారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు తోటి ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ

- కోశాధికారిజి ప్రముఖ నంది అవార్డు గ్రహీత డా. మాంకాల నవీన్ కుమార్



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 11 : అతని సేవలను గుర్తించి నియమించిన జిల్లా అధ్యక్షులు తణుకు ఆంజనేయులు పలువురు రాష్ట్ర మరియు జిల్లా నాయకుల ఆధ్వర్యంలో స్థానిక వి ఎస్ ఎస్ కన్వెన్షన్ లో నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు ఈ సందర్భంగా అదే విధంగా నా నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ కి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్ కి జిల్లా తాజామాజీ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్ కి ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు యాసాల వెంకట్ లింగంకి, మంచాల శ్రీనివాస్ కి జిల్లా తాజామాజీ ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి కి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం కార్యదర్శి మాంకాల నాగరాణి మరియుజిల్లాలో వివిధ హోదాల్లో ఉన్న సంఘం నాయకులకు పెద్దలకు నా కృతజ్ఞతలు తెలియజేసినాకు అప్పగించిన భాధ్యతలతో జిల్లాలో పూర్తి స్థాయిలో సంఘం పట్ల సేవలను సద్వినియోగం చేసి జిల్లాలో ఎన్నికైన మన జిల్లా నూతన కార్యవర్గ సభ్యులతో కలిసి, మా కుటుంబ సభ్యుల మరియు తోటి ఆర్యవైశ్య సోదర సోదరీమణుల మన్ననలతో ఆశీస్సులు పొందుతూ అందరి సహకారంతో ఆర్యవైశ్యుల ఐక్యతకు, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని గౌరవ పూర్వకముగా తెలియజేశారు.

## ఇలాంటి దాడులను కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు

- మోహన్ బాబుపై వెంటనే కేసు నమోదు చేయాలి
- జర్నలిస్టులకు కాంగ్రెస్ అండగా నిలబడుతుంది
- సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 11 : ప్రభుత్వానికి అన్ని వర్గాలకు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాచారాన్ని సేకరించి అందజేస్తున్న జర్నలిస్టులపై దాడులు సమంజసం కాదని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు.సిద్దిపేటలో సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ మోహన్ బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య జరుగుతున్న గొడవల గురించి కవరేజ్ కోసం వెళ్లిన టీవీ9 ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుపై మోహన్ బాబు దాడి చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. మోహన్ బాబుకు మానసిక స్థితి సరిగా లేనట్లు ఉందని అతని వెంటనే ఎర్రగడ్డలోని మానసిక రోగుల కేంద్రానికి పంపించాలని అన్నారు. ఇష్టం వచ్చినట్లుగా బౌన్సర్లను పెట్టి ఒక భయంకర వాతావరణ సృష్టిస్తున్నారని అన్నారు. అలాంటి వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహించ బోరని అన్నారు. జర్నలిస్టులపై అకారణంగా దాడులకు పాల్పడి విచక్షణ రహితంగా కొట్టిన మోహన్ బాబు పై పోలీసులు సుమోటో కింద వెంటనే నాన్ బేయిలేబుల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మరోసారి జర్నలిస్టులపై దాడి జరగకుండా చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుకు అండగా నిలబడుతుందని అన్నారు. మోహన్ బాబు జర్నలిస్టుపై దాడి చేయడానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కార్యదర్శి గ్యదారీ మధు ,పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గాజుద్దీన్ ,ఫయాజ్ నజ్జు, తదితరులు పాల్గొన్నారు.

## వీడియో జర్నలిస్టుపై నటుడు మోహన్ బాబు చేసిన దాడిని ఖండిస్తున్నాం

- డీజేఫ్ జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి
- రాష్ట్ర అధ్యక్షుడు మోటపలుకుల వెంకట



తొలి అడుగు, సిద్దిపేట జిల్లా, డిసెంబర్ 11 : సినీ నటులైన మంచు మోహన్ బాబు ఇంటి దగ్గర గత మూడు రోజులుగా జరుగుతున్న గొడవల నేపథ్యంలో కవరేజ్ కోసం వెళ్లిన %జ% 9 వీడియో జర్నలిస్ట్ పై మైక్ లాక్కుని మోహన్ బాబు దాడి చేసి కొట్టడం దుర్మర్గపు చర్య.మీడియా స్వేచ్ఛకు భంగం కలిగేలా వ్యవహరించడం తో పాటు జర్నలిస్ట్ పై దాడి చేసిన నటుడు మోహన్ బాబు పై జర్నలిస్టుల రక్షణ కోసం సుప్రీం కోర్టు పేర్కొన్న సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేయాలని డీజేఫ్ జాతీయ,రాష్ట్ర అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి, మోటపలుకుల వెంకట్ లు ప్రకటన విడుదల చేశారు.

## వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే ఈ సమస్యలు ఎప్పటికీ రావు..



తొలిఅడుగు, ఆరోగ్యం :వెల్లుల్లి తినడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో ఔషధ గుణాలు ఉన్న ఈ వెల్లుల్లిని ప్రజలు వంటల్లో ఉపయోగిస్తారు. అంతేకాకుండా కొందరు పచ్చి వెల్లుల్లిని తింటారు. మరికొందరు వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటారు. ఇలా నెయ్యి వేయించి తినడం వల్ల ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే కలిగే ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియదు. రోజూ నెయ్యిలో వేయించి వెల్లుల్లి తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం. వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరచడంతోపాటు చెడు కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతుంది. నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. వెల్లుల్లిలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ రెండింటి కలయిక గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే జీర్ణవ్యవస్థ బలపడుతుంది. వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తినడం వల్ల గ్యాస్ట్రిక్ జ్యూస్ ఉత్పత్తి అవుతుంది. ఇది ఆహారం సులభంగా జీర్ణమయ్యేలా చేస్తుంది. వెల్లుల్లిని ఇలా తినడం వల్ల గ్యాస్, ఎసిడిటీ సమస్యలు దరిచేరవు. కాల్చిన వెల్లుల్లి తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు ఉన్నాయి. వెల్లుల్లి, నెయ్యి రెండూ కలిపి శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే శరీరంలో మంట తగ్గుతుంది. కీళ్ల నొప్పులు లేదా కీళ్ల సంబంధిత సమస్యలతో బాధపడేవారు రోజూ వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే త్వరగా ఉపశమనం కలుగుతుంది. వెల్లుల్లిని నెయ్యిలో వేయించి తింటే శరీరం డిటాక్స్‌ఫై అవుతుంది. ఇది లోపలి నుండి శరీరాన్ని శుభ్రపరచడానికి, రక్తాన్ని శుద్ధి చేయడానికి సహాయపడే క్రియాశీల సమ్మేళనాలను కలిగి ఉంటుంది. అంతేకాకుండా దీని ప్రభావం చర్మంపై కూడా కనిపిస్తుంది.

## బీరకాయలను తినడం లేదా.. అయితే ఈ లాభాలను మీరు కోల్పోతారు..!

తొలిఅడుగు, ఆరోగ్యం : మార్కెట్‌లో మనకు రకరకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. వాటిల్లో బీరకాయలు కూడా ఒకటి. బీరకాయలను చాలా మంది అంత ఇష్టపడరు. బీరకాయలతో మనం రకరకాల కూరలు చేసుకోవచ్చు. వీటితో పప్పు లేదా పచ్చడి చేసుకోవచ్చు. టమాటా లేదా శనగపప్పు వేసి వండి తినవచ్చు. బీరకాయలు రుచిగానే ఉంటాయి. కానీ వీటి రూపం కారణంగా వీటిని తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే బీరకాయలను తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. బీరకాయల్లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. బీరకాయలను రోజూ నేరుగా తినడం ఇష్టం లేకపోతే వాటిని జ్యూస్ చేసుకుని అయినా తాగవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. బీరకాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటి జ్యూస్‌ను తాగితే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావనతో ఉంటారు. దీని వల్ల ఆహారం తక్కువగా తింటారు. దీంతో బరువు తగ్గడం తేలికవుతుంది. బీరకాయల్లో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. కొందరికి సీజన్లతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ శరీరంలో వేడిగా ఉంటుంది. దీంతో ఎల్లప్పుడూ చర్మం పగులుతుంది. అయితే అలాంటి వారు రోజూ బీరకాయ జ్యూస్‌ను తాగుతుంటే ఫలితం ఉంటుంది. బీరకాయ మన శరీరానికి చలువ చేస్తుంది. అందువల్ల వీటి జ్యూస్‌ను తాగితే శరీరంలోని వేడి మొత్తం తగ్గిపోతుంది. అలాగే చర్మం కాంతివంతంగా మారి మృదువుగా, తేమగా ఉంటుంది. చర్మం పగలదు. బీరకాయల్లో జింక్, విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. బీరకాయల్లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. బీరకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు సైతం సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీంతో వ్యాధులు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. అలాగే ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా రక్షించుకోవచ్చు. బీరకాయల్లో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఊపిరితిత్తులు, గొంతులో ఉండే కఫం మొత్తం కరిగిపోతుంది. బీరకాయల్లో అనేక పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల బీరకాయలను తీసుకోవడం వల్ల మనకు 0.91 గ్రాముల ప్రోటీన్లు, 0.14 గ్రాముల ఆరోగ్యకరమైన కొవ్వులు, 1.72 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి. అలాగే బీరకాయల్లో బయోటిన్, ఐరన్, మెగ్నిషియం, జింక్ వంటి పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల బీరకాయ జ్యూస్‌ను తాగితే బ్లడ్ షుగర్ లెవల్స్‌ను నియంత్రించవచ్చు. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా బీరకాయలతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కనుక వీటిని తీసుకోవడం మరిచిపోకండి.



## లవంగాల నీటితో కొత్త జుట్టు పెరగడం పక్కా..



తొలిఅడుగు, ఆరోగ్యం : లవంగాలు ఆరోగ్యానికి ఎంత మంచిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. లవంగాల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆరోగ్యంగా ఉంచడంలో లవంగాలు ఎంతో హెల్ప్ చేస్తాయి. అందుకే లవంగాలను ఆహారంలో భాగం చేశారు. లవంగాలతో ఎన్నో వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. సాధారణంగా లవంగాలను ఎన్నో రకాల వంటల్లో వాడుతూ ఉంటారు. ఎక్కువగా మసాలాలతో తయారు చేసే వంటల్లో ఇవి ఖచ్చితంగా ఉండాలి. ఇవి లేకపోతే వంట రుచే రాదు. లవంగాలతో శరీర ఆరోగ్యమే కాకుండా జుట్టు అందాన్ని కాపాడటంలో కూడా ఈ లవంగాలు ఎంతో ఉపయోగపడతాయి. జుట్టు సమస్యలు తగ్గడంతో పాటు కొత్త జుట్టు వచ్చేలా చేయడంలో లవంగాలు సహాయ పడతాయి. ఎందుకంటే లవంగాల్లో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. ఇవి జుట్టు ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఇందులో ఉండే బీటా కెరోటిన్ స్కాల్ఫ్ ఆరోగ్యాన్ని కపాడతాయి. మరి లవంగాలను జట్టుకు ఎలా ఉపయోగించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**కొత్త జుట్టు వస్తుంది:**

లవంగాల నీటిని జుట్టుకు రాయడం వల్ల అనేక పోషకాలు అందుతాయి. విటమిన్లు, మినరల్స్, బీటా కెరోటిన్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు రాలడాన్ని తగ్గించి.. మళ్లీ జుట్టు కొత్తగా, ఒత్తుగా పెరిగేందుకు హెల్ప్ చేస్తాయి.

**చుండ్రు తగ్గుతంది:**

లవంగాల నీరు తలకు అప్లై చేయడం వల్ల చుండ్రు సమస్య కూడా తగ్గుతుంది. చుండ్రు సమస్యతో బాధ పడేవారు లవంగాల నీటిని తలకు రాయండి. లవంగాలను నీటిలో వేసి ఓ పది నిమిషాలు మరిగించాలి. ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి వడకట్టి.. ఆ నీటిని తలకు వాడాలి. ఈ నీటిలో ఉండే యాంటీ మైక్రోబయల్ లక్షణాలు.. చుండ్రును తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది.

**హెయిర్ ఫాల్ కంట్రోల్:**

లవంగాల నీరు జుట్టుకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. హెయిర్ ఫాల్ కంట్రోల్ చేయడంలో కూడా ఈ నీరు జుట్టుకు ఉపయోగ పడుతుంది. కుదుళ్లను స్ట్రాంగ్‌గా చేసి జుట్టు రాలడాన్ని నిరోధిస్తుంది.

**తెల్ల జుట్టు మాయం:**

తెల్ల జుట్టు సమస్యతో బాధ పడేవారు సైతం లవంగాల నీటిని ఉపయోగించుకోవచ్చు. లవంగాల నీటిని స్కాల్ఫ్‌కు బాగా పట్టించాలి. ఓ అరగంట తర్వాత సాధారణ నీటితో తల కడిగేస్తే సరిపోతుంది. ఇలా తరచూ చేస్తే.. తెల్ల జుట్టు తగ్గుతుంది.

# చలికాలంలో చర్మ సంరక్షణ ఎలా?


తొలిఅడుగు, ఆరోగ్యం :చలికాలంలో చర్మం పొడిబారే అవకాశం ఎక్కువ. దీనిని ఎదుర్కొనడానికి ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. బాదం, పిస్తా, అక్రోట్, పల్లీలు, నువ్వులు, అవిసె గింజలు వంటి వాటిని ప్రతిరోజూ తీసుకోవాలి. విటమిన్ సి కూడా చర్మం ముడతలు పడకుండా ఉండేందుకు, రోగనిరోధక శక్తికి అవసరం. నిమ్మ, కమలా, నారింజ, ఆపిల్, జామ, దానిమ్మ మొదలైన తాజా పండ్లన్నీ విటమిన్ 'సి' అందిస్తాయి. ప్రతిరోజూ తప్పనిసరిగా మాయిశ్చరైజర్, ఆలివ్‌నూనె, కొబ్బరినూనె వంటివి వాడడం వలన కూడా చర్మం పొడిబారే సమస్య తగ్గుతుంది. పెదవులు పగలకుండా ఉండేందుకు తగినన్ని నీరు తీసుకోవడం, వాసిలిన్ లేదా నెయ్యి రాసుకోవడం కూడా మంచిదే. శీతాకాలంలో ఆహారాన్ని వేడిగా తీసుకోవడమే మేలు. ఎక్కువగా సూప్స్ తీసుకుంటే శరీరానికి కావలసిన నీరు అందుతుంది. అల్లం, వెల్లుల్లి, దాల్చినచెక్క, లవంగాలు వంటి మసాలా దినుసులు వాడడం వల్ల కూడా శీతాకాలం ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. ఎండ తగిలే అవకాశం తక్కువ కాబట్టి వీలుచేసుకొని రోజుకు కనీసం అరగంటైనా సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.



# మూవీపై కీలక అప్‌డేట్.. శ్రీరాముడి పాత్రపై క్లారిటీ ఇచ్చిన రణబీర్



తొలిఅడుగు, సినిమా :పాన్ ఇండియా సినిమా అంటే మేకింగ్ నుంచి ప్రమోషన్ వరకు ప్రతీ విషయంలోనూ స్పెషల్ కేర్ తీసుకుంటారు మేకర్స్. అందుకే ఆ సినిమాల ప్రొడక్షన్ టైమ్ కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది. జానర్ ఏదైనా నేషనల్ సినిమా అంటే మినిమమ్ రెండేళ్ల వర్క్ అన్నట్టుగా ఉంది పరిస్థితి. అందులో కేవలం షూటింగ్ కోసమే దాదాపు ఏడాది టైమ్ కేటాయిస్తున్నారు. యాక్షన్, కమర్షియల్ సినిమాల పరిస్థితే ఇలా ఉంటే ఫోక్ లోర్, హిస్టారికల్, మైథలాజికల్ మూవీస్‌ది ఇంకో ఎత్తని తెలిసిందే. మిగతా జానర్ల సంగతి పక్కన పెడితే మైథలాజికల్ మూవీస్ విషయంలో మాత్రం ఈ ఫార్ములా రివర్స్ అవుతోంది. మామూలుగా పురాణగాథను తెరకెక్కించాలంటే భారీ సెట్స్, అదే స్థాయిలో మేకప్, అంతకు మించిన ప్రొడక్షన్ డిటైలింగ్ అవసరం. అందుకే గతంలో మైథలాజికల్ జానర్ మూవీ అంటే అన్ని సినిమాల కన్నా ఎక్కువ టైమ్ పట్టేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. మైథలాజికల్ మూవీస్ ను అన్నింటికన్నా ఈజీగా ఫినిష్ చేసేస్తున్నారు మేకర్స్. ఆ మధ్య ఆదిపురుష్ విషయంలో ఆడియన్స్ కు షాక్ ఇచ్చారు దర్శకుడు ఓం రవుత్. ప్రభాస్, కృతిసనన్, సైఫ్ అలీఖాన్ లాంటి భారీ కాస్టింగ్ తో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ సినిమా షూటింగ్ వర్క్ ను జస్ట్ 100 రోజుల్లోనే పూర్తి చేశారు ఓం. పక్కా ప్లానింగ్ తో షూటింగ్ కు వెళ్లటం, ప్రీ ప్రొడక్షన్ విషయంలోనూ క్లియర్ గా ఉండటంతో పాటు మేజర్ పార్ట్ షూటింగ్ అంతా ఇండోర్ లో గ్రీన్‌మ్యాట్ స్టూడియోలోనే చేసేయటంతో ఆదిపురుష్ ను అంత షార్ట్ పీరియడ్ లో ఫినిష్ చేయగలిగారు. ఇప్పుడు రామాయణ్ విషయంలోనూ ఇదే ట్రెండ్ ఫాలో అవుతోంది మూవీ టీమ్. నిన్న మొన్నటి వరకు అసలు ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు స్టార్ట్ అవుతుందో అన్న చర్చే జరిగింది. ఇప్పుడు సడన్ గా తొలి భాగం షూటింగ్ పూర్తయ్యిందంటూ సర్ ప్రైజింగ్ స్టేట్మెంట్ ఇచ్చారు హీరో రణబీర్ కపూర్. మరి ఇంత షార్ట్ టైమ్ లో ఈ సినిమా షూటింగ్ ఎలా పూర్తి చేయగలిగారన్నది ఆసక్తికరంగా మారింది. రామాయణ్ విషయం లోనూ మేకర్స్ ఆదిపురుష్ స్టైల్ నే ఫాలో అవుతున్నారా. ఈ సినిమాను కూడా పూర్తిగా ఇండోర్ లోనే షూట్ చేస్తున్నారా? ఆల్రెడీ షూటింగ్ పూర్తయితే, రిలీజ్ కు నెక్ట్స్ ఇయర్ దీపావళి వరకు టైమ్ తీసుకోవటం ఎందుకు? పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కోసమే అంత టైమ్ తీసుకుంటున్నారా..? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఇండస్ట్రీ జనాల్లో కనిపిస్తున్నాయి. కాకపోతే రామాయణ్ మూవీకి సంబంధించిన ఓ ఆసక్తికర విషయంపై క్లారిటీ వచ్చేసింది. నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో తాను శ్రీరాముడి పాత్రను పోషిస్తున్నట్లు రణబీర్ కపూర్ కన్ఫర్మ్ చేశారు. ఇది తన డ్రీమ్ రోల్‌గా పేర్కొన్నారు. ఇది ప్రపంచంలో అత్యుత్తమ స్టోరీగా చెప్పారు. జెడ్డాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో మాట్లాడుతూ రణబీర్ కపూర్ ఈ వివరాలు వెల్లడించారు. కాగా ఈ మూవీలో సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తోంది.




# నెట్‌ఫ్లిక్స్‌లో తారక్ దేవర అరుదైన ఫీట్.. 2024లో టాప్

తొలిఅడుగు, సినిమా : గ్లోబల్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం దేవర. కొరటాల శివ డైరెక్ట్ చేసిన ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన విషయం తెలిసిందే. థియేటర్లలో బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ మూవీ మరోవైపు నవంబర్ 8 నుంచి ఓటీటీలో కూడా సందడి చేస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగు, తమిళం, మలయాళం కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా ఖాతాలో అరుదైన ఫీట్ చేరింది. దేవర ఈ ఏడాది నెట్‌ఫ్లిక్స్ అత్యధిక మంది వీక్షించిన రెండో సౌతిండియా సినిమాగా నిలిచింది. అంతేకాదు నెట్‌ఫ్లిక్స్ చార్ట్స్‌లో ఐదో వారంలో కూడా ట్రెండింగ్ అవుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటించగా.. ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కించారు.

# బాలీవుడ్ లో సక్సెస్ ఫుల్ హీరోయిన్ గా దూసుకుపోతుంది ఈ అమ్మడు




తొలిఅడుగు, సినిమా :చాలా మంది ముద్దుగుమ్మలు చిన్న వయసులోనే ఇండస్ట్రీలోకి వచ్చి సక్సెస్ అయ్యారు. అలాగే కొంతమంది ముద్దగుమ్మలు పెద్దగా చదువుకోకపోయినా సెలబ్రేటీలుగా మారి మంచి క్రేజ్ తెచ్చుకున్నారు. అలంటి వారిలో ఈ అమ్మడు ఒకరు. ఈ ముద్దుగుమ్మ 10 క్లాస్ కూడా పాస్ కాలేదు... కానీ రెమ్యునరేషన్ మాత్రం రూ.25 కోట్లు.. ఆస్తులు రూ.200 కోట్ల పైనే..ఇంతకూ ఆ వయ్యారి భామ ఎవరో తెలుసా..? ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేసి రాణించింది ఆ వయ్యారి. ఇంతకూ ఆ ముద్దుగుమ్మ మరెవరో కాదు, వెంకటేష్, బాలకృష్ణ లాంటి లెజెండ్ యాక్టర్స్ సరసన నటించి మెప్పించింది ఆమె. కానీ ఆమె టాలీవుడ్ భామ కాదు. బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా రాణిస్తున్న ఆ అమ్మడు.. తెలుగులో రెండే రెండు సినిమాలు చేసింది. ఆమె మరెవరో కాదు కత్రినా కైఫ్. ఈ భామ తెలుగులో వెంకటేష్ తో మల్లీశ్వరి సినిమా చేసింది. అలాగే బాలయ్యబాబుతో అల్లరి పిడుగు సినిమా చేసింది. బాలీవుడ్ లో సక్సెస్ ఫుల్ హీరోయిన్ గా దూసుకుపోతుంది ఈ అమ్మడు. కత్రినా కైఫ్ పదవతరగతి కూడా పాస్ కాలేదు.. కానీ ఈ బ్యూటీ ఒకొక్క సినిమాకు రూ.25 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటుంది. బాలీవుడ్ లో స్టార్ హీరోలందరి సరసన నటించింది. అలాగే ఈ అమ్మడి ఆస్తి దాదాపు రూ. 200కోట్లకు పైనే..

# అఖండ తాండవం

తొలిఅడుగు, సినిమా :బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన 'అఖండ' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనాల్ని సృష్టించిన విషయం తెలిసిందే. బాలకృష్ణ టెర్రిఫిక్ పర్‌ఫార్మెన్స్‌తో పాటు డివోషనల్, యాక్షన్ అంశాలతో ఈ సినిమా ప్రేక్షకుల్ని మెప్పించింది. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా 'అఖండ-2: తాండవం' తెరకెక్కనుంది. ఈ చిత్రాన్ని 14రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూట్‌ను బుధవారం మొదలుపెట్టారు. బాలకృష్ణ పాల్గొనగా రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఓ వీడియోను విడుదల చేసింది. 'ఈ నేల అసురుడిది కాదురా..ఈశ్వరుడిది..పరమేశ్వరుడిది..కాదని తాకితే జరిగేది తాండవం. అఖండ తాండవం' అంటూ బాలకృష్ణ చెప్పిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో వచ్చే ఏడాది దసరా సందర్భంగా అక్టోబర్ 25న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్, సంగీతం: తమన్, సమర్పణ: తేజస్విని నందమూరి, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.



# గాయత్రి, త్రిసా జోడీ ఓటమి




తొలిఅడుగు, హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత యువ జోడీ గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీకి శుభారంభం దక్కలేదు. బుధవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్ పోరులో గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ 22-20, 20-22,14-21తో చైనాకు చెందిన లు షెంగ్ షు, టాన్ నింగ్ ద్వయం చేతిలో ఓటమిపాలైంది. ఆద్యంతం హొరాహోరీగా సాగిన పోరులో గాయత్రి, త్రిసా తొలి గేమ్‌ను కైవసం చేసుకుని జోరు కనబరిచారు. కానీ పారిస్ ఒలింపిక్స్ రజత విజేత అయిన షెంగ్ షు, టాన్ నింగ్ అద్భుతంగా పుంజుకుని పోటీలోకి వచ్చారు. నెట్ గేమ్‌తో పాటు కండ్లు చెదిరే స్మాష్‌లతో చెలరేగిన చైనా ద్వయం 17-12తో ఆధిక్యం కనబరిచింది. అయినా వెనుకకు తగ్గని భారత జంట 18-18తో డ్రా చేసినా చివరకు గేమ్‌ను చేజార్చుకున్నారు. మూడో గేమ్‌లో మరింత దూకుడు పెంచిన చైనా షట్లర్లు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు.

# లిండే ఆల్‌రౌండ్ షో
# పాక్‌పై దక్షిణాఫ్రికా విజయం



తొలిఅడుగు,డర్బన్: పాకిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా అదిరిపోయే బోణీ కొట్టింది. బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 11 పరుగుల తేడాతో పాక్‌పై విజయం సాధించింది. తొలుత డేవిడ్ మిల్లర్(40 బంతుల్లో 82, 4ఫోర్లు, 8సిక్స్‌లు) అర్ధసెంచరీకి తోడు జార్జ్ లిండే(24 బంతుల్లో 48, 3ఫోర్లు, 4సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో నిర్ణీత 20 ఓవర్లలో 183/9 స్కోరు చేసింది. షాహీన్ అఫ్రిదీ(3/22), అబ్రార్ అహ్మద్(3/37) మూడేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పాక్..లిండే(4/21) ధాటికి 20 ఓవర్లలో 172/8 పరిమితమైంది.

## విండీస్‌దే వన్డే సిరీస్
## రెండో మ్యాచ్‌లో బంగ్లాపై గెలుపు



తొలిఅడుగు, బాసెటెర్రే(సెయింట్ కిట్స్ అండ్ నెవిస్): వెస్టిండీస్ క్రికెట్ జట్టు ఎట్టకేలకు 10 ఏండ్ల తర్వాత బంగ్లాదేశ్‌పై వన్డే సిరీస్ సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో వన్డేలో విండీస్ 7 వికెట్ల తేడాతో బంగ్లాపై ఘన విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 228 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 36.5 ఓవర్లలో 230/3 స్కోరు చేసింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్(82) అర్ధసెంచరీతో విజృంభించగా, ఎవిన్ లెవిస్(49), కీసి కార్టీ(45) రాణించారు. రానా, హుస్సేన్, అఫిఫ్ ఒక్కో వికెట్ తీశారు. తొలుత జెడన్ సీల్స్ (4/22) ధాటికి బంగ్లాదేశ్ 45.5 ఓవర్లలో 227 పరుగులకు ఆలౌటైంది. మహ్మదుల్లా(62) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. సీల్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్




తొలిఅడుగు,సింగపూర్: ప్రతిష్ఠాత్మక చెస్ చాంపియన్‌షిప్‌లో దొమ్మరాజు గుకేశ్, డింగ్ లిరెన్ మధ్య డ్రాల పరంపర కొనసాగుతున్నది. బుధవారం ఇద్దరి మధ్య జరిగిన 13వ గేమ్ డ్రాగా ముగిసింది. డిఫెండింగ్ చాంపియన్ లిరెన్‌పై గెలిచేందుకు గుకేశ్ ఆఖరి దాకా ప్రయత్నించినా లాభం లేకపోయింది. లిరెన్‌ను నిలువరించేందుకు ఎత్తుకు పైఎత్తులు వేసిన గుకేశ్ విజయం సాధించలేక 68 ఎత్తుల్లో గేమ్‌ను డ్రా గా ముగించాడు. దీంతో ఇద్దరి స్కోర్లు ప్రస్తుతం 6.5-6.5 స్కోరుతో సమమైంది. ఆఖరి రౌండ్ విజేతను నిర్ణయించనుంది.

## మంధాన పోరాడినా!




తొలిఅడుగు, పెర్త్: ఓపెనర్ స్మృతి మంధాన (109 బంతుల్లో 14 ఫోర్లు, సిక్స్‌తో 105) సెంచరీతో పోరాడినా.. మిగతా వారి నుంచి తగిన సహకారం అందకపోవడంతో ఆస్ట్రేలియా చేతిలో భారత్ మహిళల జట్టుకు పరాభవం తప్పలేదు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 83 పరుగుల తేడాతో ఆసీస్ చేతిలో చిత్తయింది. దీంతో సిరీస్‌ను కంగారూలు 3-0తో నెగ్గారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు చేసింది. పేసర్ అరుంధతి (4/26) దెబ్బకు.. ఓపెనర్లు వోల్ (25), లిచ్‌ఫీల్డ్ (26)తోపాటు పెర్రీ (4), బెత్ మూనీ (10) అవుట్ కావడంతో ఆసీస్ 78/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో గార్డ్‌నర్ (50)తో కలిసి ఐదో వికెట్‌కు 96 పరుగులు జోడించిన అనబెల్ సదర్లాండ్ (110).. కెప్టెన్ తహిల మెక్‌గ్రాత్ (56)తో కలిసి ఏడో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు సవాల్ విసరగలిగే స్కోరును అందించింది. ఛేదనలో భారత్ 45.1 ఓవర్లలో 215 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ గార్డ్‌నర్ (5/30) ఐదు వికెట్లతో భారత బ్యాటింగ్ వెన్నువిరిచింది. ఓపెనర్ రిచా (2) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా.. మంధాన, హర్లీన్ డియోల్ (39) రెండో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, హర్లీన్‌ను అవుట్ చేసిన కింగ్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించింది. హర్మన్‌ప్రీత్ (12)ను సదర్లాండ్ బోల్తా కొట్టించగా.. 189 పరుగుల స్కోరు వద్ద శతకం పూర్తి చేసుకొన్న మంధానాను గార్డ్‌నర్ బౌల్డ్ చేయడంతో భారత్ ఒక్కసారిగా ఒత్తిడికి లోనైంది. అదే స్కోరు వద్ద దీప్తి (0), జెమీమా (16) కూడా అవుట్ కావడంతో కోలుకోలేక పోయింది. మిన్నూమణి (8), అరుంధతి (5), సైమా (0)లను గార్డ్‌నర్ అవుట్ చేయగా.. టిటాస్ సాధు (3)ను కింగ్ పెవిలియన్ చేర్చింది.

# గాబాలో తస్మాత్ జాగ్రత్త!

తొలిఅడుగు,బ్రిస్బేన్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కీలకమైన మూడో టెస్ట్‌కు ప్రఖ్యాత స్టేడియం గాబా సిద్ధమైంది. బౌన్స్‌తో పర్యాటక బ్యాటర్లను బెంబేలెత్తించే ఈ వికెట్.. ఒకరకంగా ఆతిథ్య ఆస్ట్రేలియాకు పెట్టనికోట. ఇక్కడ క్రిస్మస్ ముందు జరిగిన 61 మ్యాచ్‌లో కంగారూలు 7 సార్లు మాత్రమే ఓడారు. కానీ, క్రిస్మస్ తర్వాత ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో మూడు టెస్టుల్లో పరాజయం చవిచూశారు. 1988 నుంచి గాబా స్టేడియంలో ఓటమి ఎరుగని ఆసీస్‌కు 2021లో భారత్ పరాజయాన్ని రుచిచూపింది. ఆ తర్వాత వెస్టిండీస్ జట్టు ఆసీస్‌ను కంగుతినిపించింది. అయితే, ఈ రెండు టెస్ట్‌లు జనవరిలో నిర్వహించడం గమనార్హం. బ్రిస్బేన్ వికెట్ పేస్, బౌన్స్‌తో బ్యాటర్లకు సవాల్ విసురుతుంది. క్రిస్మస్‌కు ముందు ఇది మరింత ఎక్కువగా ఉండనుండడంతో ఆసీస్ పేసర్లు చెలరేగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో శనివారం నుంచి జరిగే టెస్ట్‌కు గాబాను వేదికగా ఎంపిక చేయడం సెంటిమెంటల్‌గా కంగారూలకు కలిసి వచ్చేదే. పైగా వర్షం కురుస్తుండడంతో ఫాస్ట్ బౌలర్లకు మరింతగా సహకారం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. 'వివిధ కాలాల్లో గాబా వికెట్ భిన్నంగా ప్రతిస్పందిస్తుంది. సీజన్‌కు ముందు పిచ్ తాజాగా ఉంది. గతంలో తరహాలోనే వికెట్‌ను రూపొందించాం. పేస్, బౌన్స్‌కు గాబా ప్రత్యేకం అన్న విషయం తెలిసిందే'నని క్యూరేటర్ డేవిడ్ శాండుర్‌స్కీ చెప్పాడు.

